నమస్తే తెలంగాణ
మహబూబ్‌నగర్
నారాయణపేట
5 | మహబూబ్‌నగర్, సోమవారం 4 నవంబర్ 2024 | MAHABUBNAGAR NARAYANPET

పర్యాటక హబ్‌గా నల్లమల

ఆంజనేయస్వామి ఆలయ పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

- ఎక్సైజ్, పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు

అచ్చంపేట రూరల్, నవంబర్ 3 : నల్లమలలో వెలిసిన పురాతన ఆలయాలను అభివృద్ధి చేయడంతోపాటు పర్యాటక హబ్‌గా తీర్చిదిద్దుతామని ఎక్సైజ్, పర్యాటక సాంస్కృతిక శాఖల మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. ఆదివారం ఉమా మహేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి భోగ మహేశ్వరం పంచలింగాల ఆవరణలో రూ1.20కోట్లతో చేపడుతున్న కల్యాణ మండపం, నూతన ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే వంశీ కృష్ణతో కలిసి శంకు స్థాపన చేశారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. ఉమా మహేశ్వర ఆలయాన్ని అభివృద్ధి చేసేందుకు రూ.50ల క్షల పర్యాటక శాఖ ద్వారా కేటాయించగా, పనులను ప్రారంభించినట్లు తెలిపారు. రూ.50లక్షలను కల్యాణ మండపానికి కేటాయించామన్నారు. వీటితోపాటు అదనంగా మరో రూ.70 ల క్షతో భక్తుల అవసరాలకు మౌలిక సదుపాయాలు కల్పించడానికి 15 రోజుల్లో జీవో జారీ చేయనున్నట్లు వెల్లడించారు. ఆరు గ్యారెంటీలను విడుతల వారీగా అమలు చేస్తామని, ఇంకా నాలుగేండ్ల సమయం ఉందన్నారు. రూ.20వేల కోట్లతో ఈనెల 14 నుంచి రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి 3,500 చొప్పున ఇందిరమ్మ ఇండ్ల కార్యక్రమానికి చర్యలు తీసుకుంటున్నారు. రుణమాఫీ కాని వారికి త్వరలోనే మాఫీ చేస్తామన్నారు. ఎమ్మెల్యే వంశీకృష్ణ మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి, మంత్రి జూపల్లి కృష్ణారావు సహకారంతో నల్లమలను అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానన్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ భూత్పూర్–మద్దిమడుగు వరకు నేషనల్ హైవేకు కేంద్రానికి ఎంపీ మల్లు రవి ద్వారా ప్రతిపాదనలు పంపినట్లు గుర్తుచేశారు. అదేవిధంగా మద్దిమడుగు నుంచి మాచర్లకు ఆంధ్రప్రదేశ్–తెలంగాణ అంతరాష్ట్రాల మధ్య ఇంటర్ కనెక్టివిటీ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి కృషి చేస్తామని ఆంధ్ర సీఎం చంద్ర బాబుతో గతంలో సీఎం రేవంత్‌రెడ్డి సూచన మేరకు వినతిపత్రం అందజేశామని తెలిపారు. అనంతరం అచ్చంపేటలో రూ.60ల క్షతో నూతన గ్రంథాలయ భవన నిర్మాణానికి మంత్రి భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఉచిత కంటి వైద్య శిబిరాన్ని, సీసీఐ ఆధ్వర్యంలో మండలంలోని నడింపల్లి శివారులో ఏర్పాటు చేసిన పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ మాధవరెడ్డి, గ్రంథాలయ సంస్థ జిల్లా చైర్మన్ రాజేందర్, మున్సిపల్ చైర్మన్ శ్రీనివాసులు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ రజిత, ఈవో శ్రీనివాసరావు, కార్యదర్శి నర్సింహులు పాల్గొన్నారు.

ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులు రద్దు చేయాలి

ఇథనాల్ ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని పరిశీలిస్తున్న కుర్వ పల్లయ్య

- బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య

రాజోళి, నవంబర్ 3 : ప్రజల ప్రాణాలను కబలించే ఇథనాల్ ఫ్యాక్టరీ అనుమతులను ప్రభుత్వం వెంటనే రద్దు చేసి రాజోళి మండలంలో పెద్ద ధన్వాడ చుట్టుపక్కల గ్రామాల ప్రజలను కాపాడాలని బీఆర్ఎస్వీ జిల్లా కోఆర్డినేటర్ కుర్వ పల్లయ్య డిమాండ్ చేశారు. ఆదివారం ఆయన ఫ్యాక్టరీ నిర్మాణ స్థలాన్ని స్థానిక నాయకులు, గ్రామస్తులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుంగభద్ర నదీతీర ప్రాంతాల్లో పచ్చని పంటలు పండిస్తూ సంతోషంగా జీవిస్తున్న కుటుంబాల్లో ఫ్యాక్టరీతో అంధకారం అలుముకుంటుందన్నారు. ప్రజలకు అండగా ఉంటూ పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. ఫ్యాక్టరీ వ్యర్థాల వల్ల గాలి, నీరు కలుషితమవుతాయని, పంటలు పండక రైతులు వలసలు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. బీఆర్ఎస్ తరపున ఫ్యాక్టరీ నిర్మాణాన్ని అడ్డుకుంటామన్నారు. ఈ విషయాన్ని వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ప్రజలకు అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో నారాయణ, లక్ష్మణ్, రాజు, తిరుపతయ్యతోపాటు పలువురు గ్రామస్తులు పాల్గొన్నారు.

గన్నీ బ్యాగులేవీ..?

కొల్పూర్‌లో వడ్లు కొనుగోలు చేయాలని నిరసన తెలుపుతున్న రైతులు(ఫైల్)

- నెల కిందటే ప్రారంభమైన వరి కోతలు
- కర్ణాటకకు తరలుతున్న ధాన్యం
- టోకెన్లు ఇవ్వాలని రైతుల డిమాండ్

మాగనూరు, నవంబర్ 3 : కొనుగోలు కేంద్రాల్లో రైతులు ధాన్యం విక్రయించి దళారులను నమ్మొద్దని ప్రభుత్వం ప్రగల్భాలు పలుకుతున్నా.. ఆచరణలో మాత్రం అందుకు విరుద్ధంగా రైతులు అనేక అవస్థలు పడుతున్నారు. వరి కోతలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా ఇప్పటికీ గన్నీ బ్యాగులు కూడా లేవని మాగనూర్, కృష్ణ ఉమ్మడి మండలాల రైతులు వాపోతున్నారు. మక్తల్ ఎమ్మెల్యే వాకిటి శ్రీహరి గత నెల 16న వివిధ గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారు. ఉమ్మడి మండల వ్యాప్తంగా 10 లక్షల గన్నీ బ్యాగులు చేరాల్సి ఉండగా, కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 17 రోజులైనా ఒక్క కేంద్రానికి కూడా బ్యాగులు ఇవ్వక పోవడంతో రైతులు అయోమయంలో పడిపోయారు. రెండు మండలాల్లో 30వేల ఎకరాల వరకు సన్న రకం ధాన్యాన్ని పండించారు. అయితే వరి చేతికొచ్చి కోతలు ప్రారంభమై నెల రోజులు కావొస్తున్నా గన్నీ బ్యాగుల కొరత వేధిస్తున్నది. కొల్పూరులో వడ్లను రాశులుగా పోశామని, గన్నీ బ్యాగులు వెంటనే ఇవ్వాలని నిరసన తెలిపారు. కొంత మంది రైతులు చేసేది లేక దళారులను నమ్మి పక్క రాష్ట్ర మైన కర్ణాటకకు 75 కేజీల బస్తా చొప్పున రూ.1,650కు అమ్మడానికి సిద్ధమయ్యారు. తెలంగాణ ప్రభుత్వం రూ.2,320 మద్దతు ధరతోపాటు రూ.500 బోనస్ ఇస్తామని ప్రభుత్వం చెబుతున్నది. కేసీఆర్ సర్కారులో పంట కోతకు రాగానే పొలాల వద్దకు వెళ్లి కొనుగోలు చేసేవారని రైతులు గుర్తుచేస్తున్నారు. ధాన్యాన్ని పక్క రాష్ట్రానికి తరలిస్తున్నా చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు.

అందుబాటులో ఉన్నాయి : డీఎం దేవదాసు

రైతులకు పంపిణీ చేసేందుకు గన్నీ బ్యాగులు 21లక్షలు అందుబాటులో ఉన్నాయి. ఇంకా కొన్ని రావాల్సి ఉన్నది. గన్నీ బ్యాగులు కావాలని అడిగితే ఇస్తామని సీవో గోవర్ధన్‌రెడ్డి, సివిల్ సప్లయ్ డీఎం దేవదాసు తెలిపారు.

కర్ణాటకకు లారీల్లో ధాన్యాన్ని తీసుకెళ్తున్న రైతులు

గద్వాల మార్కెట్ యార్డులో నిలిచిన వర్షపునీరు (ఫైల్)

ఆదాయం ఘనం..

వసతులు శూన్యం

- గద్వాల వ్యవసాయ మార్కెట్‌లో అన్నీ ఇబ్బందులే..
- తాగునీటి కోసం రైతన్నల తిప్పలు
- వర్షం వచ్చిందంటే జలమయం
- మందుబాబులకు అడ్డాగా భోజన శాల
- నిరుపయోగంగా మరుగుదొడ్లు
- పట్టించుకోని పాలక మండలి, అధికారులు

గద్వాల, నవంబర్ 3 : పేరు గొప్ప ఊరు దిబ్బ అన్న చందంగా గద్వాల వ్యవసాయ మార్కెట్ పరిస్థితి నెలకొన్నది. మార్కెట్ ఆదాయం ఘనంగా ఉన్నా వసతులు చూస్తే శూన్యం. టార్గెట్‌కు మించి ఆదాయం సమకూరుతున్నా ఎవరూ పట్టించుకోకపోవడంతో మార్కెట్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందగా మారిపోయింది. జోగులాంబ గద్వాల జిల్లాలో గద్వాల, అలంపూర్ వ్యవసాయ మార్కెట్‌తోపాటు అయిజ సబ్‌యార్డు ఉన్నది. గద్వాల వ్యవసాయ మార్కెట్ జిల్లాలోని అన్ని గ్రామాల నుంచి రైతులు వ్యవసాయ ఉత్పత్తులను అమ్ముకోవడానికి వస్తుంటారు. పంట అమ్ముకొని వెళ్లే వరకు కనీస వసతులు లేవు. వారు తెచ్చిన ధాన్యంపై పడుకొని ధాన్యాన్ని అమ్ముకొని వెళ్తుంటారంటే పరిస్థితి ఎలా గుందో అర్థమవుతున్నది.

కనీస పర్యవేక్షణ కరువు..

మార్కెట్‌కు రైతులు తెచ్చిన ధాన్యం వ్యాపారులు కొనుగోలు చేసిన తర్వాత మార్కెట్ శుభ్రంగా ఉంచాలి. అందుకు మెయింటనెన్స్ చార్జీలు కోసం నిధులు మార్కెట్ నుంచి వినియోగించుకోవచ్చు. కానీ ఇక్కడి పాలకమండలి, అధికారులకు అవేవీ పట్టవు. మార్కెట్‌లో ఏ షెడ్డు వద్ద చూసినా మట్టి కుప్పలు దర్శనమిస్తాయి. వర్షం వచ్చినా, గాలి వీచినా మట్టి రైతులు ఆరబెట్టిన ధాన్యంలో కలుస్తున్నది. మార్కెట్‌లో వర్షం నీళ్లు నిల్వ లేకుండా చేసేందుకు కేసీఆర్ సర్కారు డ్రైనేజీ వ్యవస్థను ఏర్పాటు చేసింది. నిర్వహణ లోపం కారణంగా డ్రైనేజీలు మట్టితో నిండిపోయాయి. చిన్నపాటి వర్షం కురిసినా వర్షపు నీరు మార్కెట్ ఆవరణలో నిలిచి పోతున్నది.

మందుబాబులకు అడ్డాగా భోజనశాల..

రైతులు మార్కెట్‌కు ధాన్యం తీసుకొచ్చే క్రమంలో వారి ధాన్యాన్ని కొనుగోలు చేసే వరకు విశ్రాంతి తీసుకోవడంతోపాటు భోజనం చేయడానికి మార్కెట్‌యార్డు ఆవరణలో భోజన శాల ఏర్పాటు చేశారు. అయితే అది మందుబాబులకు అడ్డాగా మారింది. రైతుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని మాజీ మంత్రి హరీశ్‌రావు మార్కెట్‌యార్డు ఆవరణలో చల్లటి తాగునీటి కేంద్రాలు ఏర్పాటు చేయగా, నిర్వహణ లోపం కారణంగా రైతులకు తాగునీరు అందడం లేదు. దీంతో రైతులు తాగునీటి కోసం అవస్థలు పడాల్సిన దుస్థితి నెలకొన్నది.

మరుగుదొడ్లు ఉన్నా నిరుపయోగం..

మార్కెట్ యార్డు ఆవరణలో మార్కెట్‌కు వచ్చే వారి కోసం మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. నిర్వహణ లోపం కారణంగా తాళాలతో దర్శనమిస్తున్నాయి. బీఆర్ఎస్ సర్కారులోనే మార్కెట్ అభివృద్ధి కోసం ప్రతిపాదనలు పంపగా, రూ.3కోట్ల 50ల క్షలు మంజూరయ్యాయి. టెండర్ల ప్రక్రియ పూర్తయినప్పటికీ పనులు చేయకపోవడంతో నిధులు వెనక్కి వెళ్లినట్లు తెలిసింది.

అభివృద్ధి శూన్యం..

గద్వాల వ్యవసాయ మార్కెట్ ఆదాయం ఘనంగా.. అభివృద్ధి మాత్రం శూన్యంగా మారింది. 2023–2024 ఆర్థిక సంవత్సరంలో జిల్లా లక్ష్యం రూ.4కోట్ల 86లక్షలు కాగా, రూ.6కోట్ల 44లక్షల ఆదాయం వచ్చింది. 2024–2025 లక్ష్యం రూ.5కోట్ల 42లక్షలు కాగా, ఇప్పటి వరకు రూ.2కోట్ల 31లక్షల ఆదాయం వచ్చింది. జిల్లా పరిధిలో చెక్‌పోస్టులతోపాటు మార్కెట్ వచ్చే పల్లి, వరి, పత్తి ద్వారా ఆదాయం సమకూరుతున్నది.

గద్వాల మార్కెట్‌లో నిరుపయోగంగా ఉన్న రైతుల భోజనశాల, తాగునీటి కేంద్రం, మరుగుదొడ్లు

మార్కెట్‌లోని సమస్యలు పరిష్కరిస్తాం..

జిల్లా కేంద్రంలోని మార్కెట్‌లో సమస్యలున్న మాట వాస్తవమే. అయితే మార్కెట్‌లో వసతులు కల్పించడానికి గతంలో ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరయ్యాయి. టెండర్ ప్రక్రియ పూర్తయ్యింది. వచ్చిన నిధులతో మార్కెట్‌లో రైతులకు ప్యూరీఫైడ్ వాటర్ సౌకర్యంతోపాటు ప్రహరీ, సీసీ, డ్రైన్‌లు ఏర్పాటు చేస్తాం. రైతులకు సేద తీరడానికి ఏర్పాటు చేస్తాం. – పుష్పమ్మ, జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారిణి

వైఫల్యాలను ఎండగట్టేందుకే భరోసాయాత్ర

- 11 నెలలైనా ప్రజలకు ఒరిగిందేమిటి?
- పెండింగ్ ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలి
- కృష్ణా జలాల హక్కులను కాపాడాలి
- ప్రభుత్వ అండతో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం
- డిసెంబర్ 7న నిరసన దీక్ష
- మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్‌లో విలేకరులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి

నాగర్‌కర్నూల్, నవంబర్ 3 : కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 11నెలలు గడిచినా రాష్ట్రంలో అసమర్థ పాలనతో నైరాశ్యం నెలకొన్నదని, ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలకు వివరించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో భరోసా యాత్ర చేపడతానని మాజీ మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి వెల్లడించారు. ఆదివారం నాగర్‌కర్నూల్‌లోని ఆయన స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాగం మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి పాలనలో పూర్తిగా వైఫల్యం చెందడం వల్ల మంత్రులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. పాలకులు కాంట్రాక్టర్లతో కుమ్మక్కై ఇష్టానురాజ్యంగా వ్యవహరిస్తున్నారని, పెండింగ్ పనులను పూర్తి చేయడంలో సీఎంకు చిత్తశుద్ధి లేదన్నారు. పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంతోపాటు ఉమ్మడి పాలమూరు జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులు పూర్తి చేసి ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. పాలమురు–రంగారెడ్డి పథకంలోని 3వ ప్యాకేజీ పనులను వెంటనే ప్రారంభించి త్వరితగతిన పూర్తి చేయలేకపోతే డిసెంబర్ 7వ తేదీన చేపడుతానన్న నిరసన దీక్ష యథావిధిగా కొనసాగుతుందని తెలిపారు. కాల్వల సామర్థ్యాన్ని పెంచి రిజర్వాయర్లను పూర్తి చేస్తే భూగర్భజలాలు పెరిగే అవకాశం ఉందన్నారు. సీతారామ ప్రాజెక్టు పూర్తి చేయాలని మంత్రులు పేర్కొన్నారని, మరి ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రి జూపల్లి కృష్ణారావు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై ఎందుకు నోరు మెదపడం లేదని ప్రశ్నించారు. నీటి మునిగిన మోటర్లను ఎందుకు పట్టించుకోవడం లేదని, బురదలో ఉన్న మోటర్లను నీటితో కడిగారే తప్పా వాటిని ఎందుకు మరమ్మతులు చేయడం లేదని నిలదీశారు. రెండు మోటర్లు పనిచేయవని అధికారులు స్పష్టంగా పేర్కొన్న విషయాన్ని గోప్యంగా ఉంచుతున్నారని మండిపడ్డారు. బ్లాస్టింగ్ జరిగే సందర్భంలో కేఎల్ఐ ప్రాజెక్టు మోటర్లకు ప్రమాదం ఏర్పడుతుందని తెలిసినా నిర్లక్ష్యం చేశారని, దీనివల్లే మోటర్లు నీట మునిగాయని ఆరోపించారు. రాహుల్‌గాంధీ రాష్ట్ర పర్యటన సందర్భంగా పెండింగ్ ప్రాజెక్టుల పూర్తికి, ఆరు గ్యారెంటీల అమలుపై దృష్టి సారించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు అర్థం రవి, బాలా గౌడ్, లక్ష్మయ్య, అహ్మద్, సత్యం, వెంకటేశ్, వెంకట స్వామి, అర్జునయ్య, సుబ్బయ్య, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

హంసవాహనంపై ఊరేగుతున్న స్వామివారు

హంసవాహనంపై దేవదేవుడు

చిన్నచింతకుంట, నవంబర్ 3 : కురుమూర్తి స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం హంసవాహనంపై స్వామివారిని శారదా రూపంలో ప్రధాన ఆలయం నుంచి కొండపై గల ముఖద్వారం వరకు ఊరేగించారు. వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ గోవర్ధన్‌రెడ్డి, ఈవో మదనేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు బిజ్వారానికి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

మల్దకల్, నవంబర్ 3 : బీఆర్ఎస్ నేత ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ సోమవారం మల్దకల్ మండలంలోని బిజ్వారం గ్రామానికి రానున్నట్లు పార్టీ నాయకులు ఆదివారం ప్రకటనలో పేర్కొన్నారు. దొంగతనం మోపడంతో బాలిక రాజేశ్వరి(16) మృతిచెందగా, బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తారని ఆ పార్టీ నాయకులు తెలిపారు.

పత్తిపంటలో క్షుద్రపూజల కలకలం

నాగర్‌కర్నూల్, నవంబర్ 3 : తెలకపల్లి మండలం తాళ్లపల్లిలోని పత్తి పంటలో క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు కనిపించడంతో రైతులు, గ్రామస్తులు భయాందోళనకు గురయ్యారు. పొలం యజమాని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విషయం బయటపడింది. తాళ్లపల్లికి చెందిన పెద్ద చిలిశ్వేశ్వరం తిరుపతయ్య పొలంలో పత్తి పంటను సాగు చేశాడు. భారీ వర్షాల కారణంగా పెద్ద ఎత్తున రైతులకు నష్టం సంభవించినా తిరుపతయ్య పత్తిపంట ఏపుగా పెరిగింది. దీంతో చూసి ఓర్చుకోలేని కొందరు సదరు రైతు పొలానికి క్షుద్ర పూజలు చేసి ఉంటారని గ్రామస్తులు అనుమానిస్తున్నారు. ఇదిలా ఉండగా, కొంతకాలంగా తిరుపతయ్య దాయాదులైన చిలిశ్వేశ్వరం కృష్ణయ్య, అతడి కుమారులు మహేశ్, శివ అన్నదమ్ములు హైదరాబాద్‌లో ఉంటున్నారు. దాయాదుల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయని, వారే ఈ క్షుద్ర పూజలు చేసి ఉంటారని తిరుపతయ్య కుటుంబ సభ్యులు, గ్రామస్తులు అనుమానిస్తూ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

రైతు పొలంలో జరిపిన క్షుద్ర పూజలు

పసిప్రాయంపై అఘాయిత్యం

- మూడేండ్ల చిన్నారిపై లైంగిక దాడికి యత్నం
- పిస్తా హౌస్‌లో పనిచేస్తున్న యువకుడు
- దేహశుద్ధి చేసిన స్థానికులు
- మధ్యాహ్నం ఘటన జరిగితే సాయంత్రం కేసు నమోదు
- మతిస్థిమితంలేదని బుకాయించేందుకు ఖాకీల యత్నం
- పాలమూరులో సంచలనంగా మారిన ఘటన
- నిందితుడిపై పోక్సో కేసు : సీఐ

అభం శుభం తెలియని చిన్నారులను సైతం మానవ మృగాలు వదలడం లేదు.. తోటి పిల్లలతో సరదాగా ఆడుకుంటూ వెళ్లిన మూడేండ్ల చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడేందుకు ప్రయత్నించడంతోపాటు గొంతు నులిమి చంపేందుకు ప్రయత్నించిన ఘటన మహబూబ్‌నగర్‌లో చోటుచేసుకున్నది. విషయం దావణంలా వ్యాపించడంతో ఉమ్మడి జిల్లా ఉలిక్కిపడింది. అక్కడే ఆడుకుంటున్న తోటి చిన్నారులు గమనించి సమీపంలో ఉన్న మెడికల్ కళాశాల స్టూడెంట్లకు విషయం తెలుపడంతో చిన్నారి బతికి బయటపడింది. లేదంటే మానవమృగం చేతిలో శవంగా మారేది. కాగా, చిన్నారిపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడు పిస్తాహౌస్‌లో పనిచేస్తుండగా, వారి సూచన మేరకు అతడిని కాపాడేందుకు ఖాకీలు ప్రయత్నించడం కొసమెరుపు.

మహబూబ్‌నగర్, నవంబర్ 3 : మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని పిస్తా హౌస్ సమీపంలోని పార్కులో మూడేళ్ల బాలిక తోటి బాలబాలికలతో కలిసి ఆడుకుంటున్నది. పక్కనే పిస్తా హౌస్‌లో పనిచేస్తున్న వెస్ట్ బెంగాల్‌కు చెందిన 20 ఏండ్ల రిజ్వాన్ ఆదివారం మధ్యాహ్నం 1:20 గంటల సమయంలో పార్కుకు వచ్చి బాలికను పార్కు పక్కకు తీసుకెళ్లాడు. బాలిక భయపడుతుండగానే లైంగికదాడికి ఒడిగట్టే ప్రయత్నం చేశాడు. బాలిక ఏడుపును చూసిన తోటి పిల్లలు బయట ఉన్న మెడికల్ కాలేజీ విద్యార్థులకు చెప్పడంతో వారు వెంటనే ఘటనా స్థలానికి వెళ్లారు. కాగా, అప్పటికే రిజ్వాన్ బాలిక గొంతు నులిమే ప్రయత్నం చేస్తుండడంతో వారు బాలికను రక్షించి యువకుడిని పట్టుకొని దేహశుద్ధి చేశారు. పార్కు పక్కనే ఉన్న బాలిక తండ్రి ఈ ఘటన చూసి నిర్ఘాంత పోయారు. విషయం తెలుసుకున్న కాలనీవాసులు గుమిగూడడంతో పిస్తా హౌస్‌లో పనిచేసే దాదాపు 15మంది రిజ్వాన్‌కు అండగా నిలబడ్డారు. హోటల్ యాజమాన్యానికి విషయం తెలుపడంతో వారు పోలీసులకు సమాచార మిచ్చారు. రూరల్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని రిజ్వాన్‌కు కాలనీవాసుల నుంచి అదుపులోకి తీసుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

పోలీస్‌స్టేషన్‌లో హైడ్రామా..

రిజ్వాన్‌ను పోలీస్‌స్టేషన్‌కు తరలించిన పోలీసులు బాలికపై లైంగికదాడి యత్నానికి ఒడిగట్టిన అంశంపై కేసు నమోదు చేయడానికి తాత్సారం చేయడం పలు అనుమానాలకు తావిస్తున్నది. మధ్యాహ్నం పోలీస్‌స్టేషన్‌కు చేరుకున్న బాధితులతో పోలీసులు రిజ్వాన్‌కు మతిస్థిమితం లేని వాడిగా కనిపిస్తున్నాడని చెప్పగా, మతిస్థిమితం లేని వ్యక్తులను హోటల్‌లో ఎలా పనిచేయించుకుంటున్నారని ప్రశ్నించడంతో విచారణ చేయిస్తామని బుకాయించి బాధితులను అక్కడి నుంచి పంపించారు. చివరికి నిందితుడు వెస్ట్ బెంగాల్‌కు చెందిన వాడిగా గుర్తించి అక్కడ ట్రీట్మెంట్ చేసుకున్న కొన్ని ప్రిస్క్రిప్షన్లను చూపించే ప్రయత్నం చేశారు. దీంతో బాధితులు ఆవేదనతో వెనుదిరిగి జరిగిన ఘటనను మీడియాకు వివరించారు. అప్పటికే ఈ విషయం జిల్లా కేంద్రం లో దావనంలా వ్యాపించడంతో పోలీసులు సాయంత్రం 6గంటల తర్వాత బాధితులను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కేసు నమోదు చేశారు.

పోక్సో కేసు నమోదు చేశాం : సీఐ

పిస్తా హౌస్‌సమీపంలోని పార్కులో బాలికపై లైంగిక దాడికి యత్నించిన నిందితుడిపై పోక్సో కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు రూరల్ సీఐ గాంధీనాయక్ మీడియాకు వివరించారు. నిందితుడు పిస్తాహౌస్‌లో పనిచేస్తున్నాడని, బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసునమోదు చేశామన్నారు.

నిందితుడిపై చర్యలు తీసుకోవాలి..

మధ్యాహ్నం భోజనం చేసి పక్కనే ఉన్న పార్కులో ఆడుకుంటూ వెళ్లిన కొద్దిసేపటికే తన కూతురిని చూడరాని స్థితిలో చూసి భయపడిపోయాను. మూడేళ్ల బాలికపై ఇలాంటి అఘాయిత్యానికి పాల్పడిన నిందితుడిని కఠినంగా శిక్షించాలి. పోలీసులు కేసును తప్పుదోవ పట్టించే ప్రయత్నం చేస్తున్నారు. ఈ యువకుడు కొద్ది రోజులుగా అనుమానాస్పదంగా తిరుగుతున్నట్లు తెలిసింది. పోలీసు ఉన్నతాధికారులు మరో బాలికకు ఇలాంటి దారుణం జరగకుండా నిందితుడిని కఠినంగా శిక్షించాలి. – బాలిక తండ్రి